క్లుప్తంగా

ఏయూ ఉద్యోగులకు 28 డేస్ వర్తింపజేయాలి



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న ఏయూ ఉద్యోగులు

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని పలు హాస్టళ్లలో డైలీ వేజ్ వర్కర్లుగా పని చేస్తున్న ఉద్యోగులకు 28 రోజుల కేటగిరీ వర్తింపజేయాలని పలువురు ఉద్యోగులు కోరారు. ఈ మేరకు విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణను లాసన్స్ బే కాలనీలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత 10 ఏళ్లుగా 310 మందికి పైగా వర్సిటీలోని వివిధ హాస్టళ్లలో పని చేస్తున్నారని, వారందరికీ 28 రోజులు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని కోరారు.

సీతాకోక చిలుకలపై పద్యాల పోటీలు

ఆరిలోవ: సీతాకోక చిలుకలపై పద్యాల పోటీలు నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ నందనీ సలారియా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న ప్రపంచ సీతాకోక చిలుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వయసుతో సంబంధం లేకుండా అందరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సీతాకోక చిలుకలపై రాసిన పద్యాలు, వారి పూర్తి పేరు, వయసు, ఫోన్ నంబరుతో రాసి ఈ నెల 15వ తేదీలోగా events.igzp@gmail.com మెయిల్‌కు పంపించాలని ఆమె సూచించారు. మెయిల్ సబ్జెక్టులో సీతాకోక చిలుక పద్యాల పోటీ సమర్పణ అని రాయాలన్నారు. విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు, పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 78936 32900 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

వంగవీటి విగ్రహం ఏర్పాటుకు ఆటంకం

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు నుంచి 13వ వార్డు పరిధిలోని కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకులు వంగవీటి మోహన్‌రంగా విగ్రహం ఏర్పాటుకు కొద్ది రోజులుగా సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా 12వ వార్డు పరిధి బీఆర్‌టీఎస్ రోడ్డులో పెదగదిలి కూడలి వద్ద వంగవీటి విగ్రహం ఏర్పాటు చేయడానికి సిద్ధమయ్యారు. దీంతో మంగళవారం ఈ కూడలి వద్ద పనులు ప్రారంభించారు. దీంతో స్థానికులు కొందరు అక్కడ విగ్రహం ఏర్పాటు చేయవద్దంటూ అడ్డుకుని జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. ఈ మేరకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తమ సిబ్బందిని పంపించి విగ్రహం ఏర్పాటు పనులను నిలిపివేశారు. దీంతో నిర్వాహకులు, స్థానికుల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. చివరకు నిర్వాహకులు అక్కడ విగ్రహం ఏర్పాటును విరమించుకున్నారు.

ఎంవీపీ రైతుబజార్‌లో అందుబాటులో శనగపప్పు



ఎంవీపీ రైతుబజార్‌లో శనగపప్పు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో శనగపప్పు మళ్లీ అందుబాటులోకి వచ్చింది. కొన్నాళ్లుగా రైతుబజార్‌లో భారత్ శనాదాల్ పేరుతో శనగపప్పు సబ్సిడీపై విక్రయిస్తున్న విషయం తెలిసిందే. స్టాక్ లేక సుమారు రెండు వారాల పాటు ఇక్కడ శనగపప్పు విక్రయించలేదు. మళ్లీ మంగళవారం 5 టన్నుల శనగపప్పు స్టాక్ వచ్చింది. దీంతో వినియోగారులకు శనగపప్పు విక్రయిస్తున్నట్లు రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు. సబ్సిడీపై కిలో రూ.60 చొప్పున ప్రతి ఒక్కరికి 5 కిలోల వరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మళ్లీ జగనే ముఖ్యమంత్రి

- అందు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు..
- వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొత్స ఝాన్సీ
- తూర్పులో ఘనంగా పార్టీ 14వ ఆవిర్భావ వేడుకలు



15వ వార్డు సింహాద్రిపురంలో వృద్ధురాలికి కేక్ తినిపిస్తున్న బొత్స ఝాన్సీ

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ 14వ ఆవిర్భావ వేడుకలు తూర్పు నియోజకవర్గంలో మంగళవారం జరిగాయి. 15వ వార్డు సింహాద్రిపురం కొండవాలులో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి నడింపల్లి కృష్ణంరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొత్స ఝాన్సీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆమె చేతుల మీదుగా సుమారు 500 మంది పేదలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. దీన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్షం పొత్తులతో ఒక్కటై ఓడించడానికి కుతంత్రాలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు.

అనంతరం నడింపల్లి కృష్ణంరాజు మాట్లాడుతూ విద్యావంతురాలు, విశాఖ వాసి అయిన బొత్స ఝాన్సీని విశాఖ పార్లమెంట్ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేస్తున్నారన్నారు. ఆమెను గెలిపించి విశాఖ అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆమె దృష్టికి సింహాద్రిపురం కాలనీ సమస్యలు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు సూరిశెట్టి సన్యాసిరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కణితి మరియదాసు, పెద్దిరెడ్ల నూకరాజు, వెలంగాని రావు, రాజేష్, రమణమ్మ, లక్ష్మీ, జనార్దన్, నాగరాజు, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.



22వ వార్డులో ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తున్న పీతల గోవింద్, తదితరులు



28వ వార్డులో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, దుర్గారావు

బీచ్ రోడ్డు: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు జీవీఎంసీ 28వ వార్డు భానోజీనగర్‌లో పార్టీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో జరిగాయి. కార్పొరేటర్ పల్లా అప్పలకొండ పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను చేసేందుకు ప్రతి ఒక్కరూ శ్రమించాలని కోరారు.

- జీవీఎంసీ 22వ వార్డులో పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించి, వచ్చే ఎన్నికల్లో గెలుపునకు బాటలు వేయాలని గోవింద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలతో పేదల జీవితాల్లో వెలుగులు



16వ వార్డు కేఆర్ఎం కాలనీలో పర్యటిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం 16వ వార్డు కేఆర్ఎం కాలనీలో ఎంపీ పాదయాత్ర నిర్వహించారు. కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఎంవీవీ ఆప్యాయంగా పలకరించారు. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాల గురించి ఆరా తీశారు. లబ్ధిదారులతో ముచ్చటించారు. చేకూరిన లబ్ధిని తెలుసుకున్నారు. అర్హులైన వారందరికి సంక్షేమ ఫలాలు అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ ఎంవీవీ స్పష్టం చేశారు. ఐదేళ్ల పాటు అభివృద్ధిని గాలికి వదిలేసిన స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి ఎన్నికలు వచ్చేసరికి ఓట్ల కోసం పరుగులు పెడుతూ వస్తున్నారన్నారు. అలాంటి వారికి ఓటుతో తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

9వ వార్డు టీడీపీలో వర్గపోరు!

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మధ్య వర్గపోరు రాజ్యమేలుతోంది. దీనికి జీవీఎంసీ 9వ వార్డు టీడీపీ నాయకులే నిదర్శనం. ఇక్కడి పార్టీలో బయటకు కనిపించేవి రెండు వర్గాలు. లోలోపల మాత్రం ఎవరికివారే ఎమునా తీరే అన్న చందంగా మారింది. ఈ వార్డులో అక్కరమాని రాంబాబు(పార్టీ వార్డు అధ్యక్షుడు), బుడుమూరు గోవింద్(పార్టీ వార్డు ఇన్‌చార్జి) రెండు వర్గాలు కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన ఆ పార్టీ కార్యక్రమాలకు ఏదో ఒక వర్గం దుమ్మా కొడుతోంది. ఒక వర్గానికి ప్రాధాన్యత ఇస్తే రెండో వర్గం చిర్రుమంటోంది. దీంతో ఈ వార్డు వ్యవహారం ఎమ్మెల్యే వెలగపూడికి తలనొప్పిగా మారింది. ఇదంతా ఎమ్మెల్యే చేసుకున్న స్వయంకృతమేనని ఆ పార్టీ నాయకులే అంటున్నారు. ఆ రెండు వర్గాల నాయకులను వేరు చేసినదే వెలగపూడేనట. ఇప్పుడు ఆ వర్గాల తీరు ఆయనకు నిద్రపట్టనీయడం లేదట. గతేడాదిలో చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు నియోజకవర్గంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలకు అవసరమైన జన సమీకరణ కోసం అన్ని వార్డుల్లోను పార్టీలో వర్గాలుగా విడదీసేశారు. ప్రతి వర్గం నుంచి జనాలను తీసుకురావాలని హుకుం జారీచేశారు. ఇందులో భాగంగా 9వ వార్డు నుంచి అక్కరమాని రాంబాబు, బుడుమూరు గోవింద్ వేర్వేరుగా జనాలను తీసుకొని నిరసన కార్యక్రమాలకు హాజరయ్యేవారు. అప్పట్లో కొంతవరకు ఈ వర్గాలు ఎమ్మెల్యేకి ఉపయోగపడ్డాయి. ఇప్పుడు సాధారణ ఎన్నికలు వచ్చేసరికి ఎమ్మెల్యే పిలుపు మేరకు ఒక వర్గం వస్తే మరో వర్గం ముఖం చాటేస్తోంది. దీంతో వార్డులో చేపడుతున్న టీడీపీ కార్యక్రమాలు జనం లేక వెలవెలబోతున్నాయి. ఈ పరిస్థితి చూసి ఎమ్మెల్యే నోరెళ్లబెడుతున్నారని ఆ పార్టీ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు. పార్టీ పరువు పోతుందని భావించిన వెలగపూడి కొద్ది రోజులుగా 9వ వార్డులో ఎలాంటి కార్యక్రమం కూడా చేపట్టడం లేదట. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల ప్రభావంపై ఈ వర్గపోరు పడుతుందేమోనని ఆయన మదనపడుతున్నట్టు ఆ పార్టీ కార్యకర్తలు చెప్పుకుంటున్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: అన్నింటా నైపుణ్యాలు పెంపొందించుకునే దిశగా యువత నడవాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. మంగళవారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఈసీఈ విభాగ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సమర్థత దిశగా విద్యార్థులు అడుగులు వేయాలన్నారు. మార్పులను స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. అవధులు లేని అవకాశాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. గత నాలుగేళ్ల కాలంలో ఏయూను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. ప్రతీ విభాగంలో 80 శాతం మందికిపైగా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ ఏయూని ప్రపంచంతో కనెక్ట్ చేసే బాధ్యత విద్యార్థులదేనన్నారు. సాంకేతికత అవసరం, ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ ప్రయోగశాలల అభివృద్ధికి అవసరమైన నిధులను ఏయూ అందించి, పూర్తి స్థాయిలో ఆధునికీకరించిందన్నారు. ప్రాజెక్టులు, పేటెంట్లపై విభాగం ఆచార్యులు దృష్టి సారించాలన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

ఆరిలోవ: మహిళా చట్టాలపై అవగాహన అవసరమని బాలాజీనగర్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ లలిత తెలిపారు. మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మంగళవారం జీవీఎంసీ 11వ వార్డు గాంధీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ కిరణ్ లలిత మాట్లాడుతూ మహిళలు ధైర్యంగా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్య, వైద్యం, రాజకీయ, రక్షణ రంగాలలో ఎక్కువ మంది మహిళలు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మేజిక్ బస్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో భరోసా



మృతుని కుటుంబీకులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డు మద్దిలపాలేనికి చెందిన తామాడ శ్రీను(41) ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.6.50 లక్షల చెక్కును విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అందజేశారు. బాధితులకు ఆర్థిక భరోసాగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో దోహదపడుతుందన్నారు. వైఎస్సార్ బీమా కింద రూ.5 లక్షలు అందించినట్టు చెప్పారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి



కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న కర్రి వేణుమాధవ్

ఎంవీపీ కాలనీ: గీతాంజలి మరణానికి కారకులైన వారిని రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని టీటీడీ కూడలిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళా విభాగం నాయకులు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం పనితీరుపై మీడియా వేదికగా గీతాంజలి ఇటీవల హర్షం వ్యక్తం చేసిందన్నారు. తనకు ఇల్లు మంజూరు కావడంతో పాటు అమ్మఒడి వంటి పథకాల ద్వారా జరుగుతున్న లబ్ధిపై ఆమె ఆనందం వ్యక్తం చేసిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఆమెను టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కొందరు సోషల్ మీడియా వేదికగా వేధింపులకు గురిచేశారని ఆరోపించారు. ఆ వేధింపులకు తాళలేకే గీతాంజలి ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆమెను వేధింపులకు గురిచేసిన వారిపైన, అసభ్యకరంగా మేసేజ్‌లు పెట్టిన వారిపైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతురాలి పిల్లలను ఆదుకునేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు కృపాజ్యోతి, మహిళ విభాగం నాయకులు సత్యవతి, జోషిలా, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి కుటుంబానికి న్యాయం చేయాలి

బీచ్ రోడ్డు: సోషల్ మీడియా వేధింపులకు గురై మరణించిన గొల్లి గీతాంజలి కుటుంబానికి న్యాయం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆమె మృతికి నివాళిగా బీచ్ రోడ్డులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేయాలన్నారు. మహిళల పట్ల సోషల్ మీడియాలో అసత్య ప్రచారం మానుకోవాలని కోరారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబుకు పుస్తకాలు అందిస్తున్న హృషికేష్

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల గ్రంథాలయానికి డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థి హృషికేష్ పలు పుస్తకాలు సమకూర్చారు. ఈ మేరకు వాటిని మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబుకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా హృషికేష్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, అధ్యాపకులు ఉమామహేశ్వరరావు, ప్రతాప్, ఎం.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు మూలపాలెం, వాసవానిపాలేనికి చెందిన 1500 మందికి పైగా మత్స్యకారులు మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి ఎంవీవీ పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ సర్కారు అద్భుత పాలన అందించిందన్నారు. 18వ వార్డు సర్వముఖాభివృద్ధికి కృషి చేసే బాధ్యత తనదని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ తూర్పు పరిశీలకుడు మొల్లి అప్పారావు, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధిపై అవగాహన అవసరం

- కంటి వైద్యుడు డాక్టర్ రవీంద్ర



గ్లకోమా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రవీంద్ర, వైద్యులు

సింహాచలం: గ్లకోమా అనేది నిశ్శబ్దంగా కంటి చూపును అపహరించే ప్రమాదకర వ్యాధి అని, ఈవ్యాధిపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ రవీంద్ర తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో మంగళవారం నుంచి ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆస్పత్రి నుంచి వేపగుంట వరకు పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ రవీంద్ర మాట్లాడుతూ గ్లకోమా వ్యాధి నివారణకు ఎప్పటికప్పుడు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శంకర్ ఫౌండేషన్‌లో అన్ని రకాల కంటి శస్త్ర చికిత్సలకు మెరుగైన వైద్యం అందిస్తోందని తెలిపారు.కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ లక్ష్మీ, డాక్టర్ మంజువల్లి, డాక్టర్ కవితాదేవి, డాక్టర్ సవర్ణ, డాక్టర్ శశి, డీజీఎం కె.బంగార్రాజు,ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తీరంలో గేమ్ ఛేంజర్ షూటింగ్‌కు ఏర్పాట్లు

బీచ్‌రోడ్డు: మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ హీరోగా ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న గేమ్ ఛేంజర్ సినిమా షూటింగ్ సాగరతీరంలో జరగనుంది. షూటింగ్ కోసం తీరంలో భారీ సెట్ వేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి.


మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఎంవీపీ కాలనీ: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పెదవాల్తేర్‌కు చెందిన బోరా సతీష్(30) అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు సీఐ సంజీవరావు బృందం దాడులు చేసింది. ఈ ఘటనలో 24 బీరు బాటిళ్లు, 3 ఎంహెచ్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

పోర్టులో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

జగదాంబ: పోర్టులోని వేదాంత కంపెనీ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. అదే కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న పోతనపల్లి రాజేశ్వరరావు మంగళవారం మధ్యాహ్నం వీపీటీ సరిహద్దులోని ఔటర్ గోడ రైల్వే ట్రాక్ ఎదురుగా ఈ మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే హార్బర్ పోలీసులు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. చనిపోయిన వ్యక్తి వయసు 50 నుంచి 55 ఏళ్లు ఉంటుందని, మృతదేహం కుళ్లిపోయి ఉందన్నారు. నీలం రంగు షర్ట్, బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు 91548 79915లో సంప్రదించాలని కోరారు.


భవిత కేంద్రంలో ఫిజియోథెరపీ భవనం ప్రారంభం




ఫిజియోథెరపీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున

కూర్మన్నపాలెం: దివ్యాంగ చిన్నారులకు అవసరమైన వసతులు కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. అభయ ఫౌండేషన్-హైదరాబాద్, స్పందన చేయూత ఫౌండేషన్ సౌజన్యంతో వడ్లపూడి భవిత కేంద్రంలో అధునాతన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన హైడ్రోథెరపీ, సాండ్ థెరపీలతో కూడిన ఫిజియోథెరపీ నూతన భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిత కేంద్రాలకు విచ్చేస్తున్న చిన్నారులకు ఫిజియోథెరపీ కోసం ఏర్పాటు చేసిన భవనాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. దివ్యాంగ చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భవిత కేంద్రాలకు ప్రభుత్వం భరోసా కల్పించనుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యం, అభయ ఫౌండేషన్, స్పందన చేయూత ఫౌండేషన్ సభ్యులు ఇ.బుచ్చిబాబు, కె.రవి, సీతారామరాజు, అడ్వైజర్ ఎ.ఎస్.ఎస్.మూర్తి, సమగ్ర శిక్ష అభియాన్ ఐఈ కన్సల్టెంట్ నరసింహం, జిల్లా ఐఈ కో-ఆర్డినేటర్ బి.గీత, ఇతర సెక్టోరియల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియలో ఐటీ సభ్యుల పాత్ర కీలకం





శిక్షణలో ఐటీ టీం సభ్యులకు సీ విజిల్ యాప్ కోసం వివరిస్తున్న ఎన్ఐసీ అధికారి

మహారాణిపేట: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ఐటీ సభ్యుల పాత్ర చాలా కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ అన్నారు. ఐటీ అప్లికేషన్స్, యాప్స్ వినియోగం, తదితర అంశాలపై వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వివిధ విభాగాల నుంచి ఎంపికైన ఐటీ టీం సభ్యులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. జీవీఎంసీ ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్‌తోపాటు పాల్గొన్న జేసీ పలు అంశాలపై మాట్లాడారు. ఐటీ టీం సభ్యులు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడ ఏం జరిగినా జిల్లా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. ఎన్నికల నియమావళి దాటి ఎవరు ప్రవర్తించినా, ఉల్లంఘనలకు పాల్పడినా సీ విజిల్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులు, ఇతర అంశాలపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఐటీ అప్లికేషన్లు, సి.విజిల్ యాప్ వినియోగంపై ఎన్ఐసీ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డెమో ఇచ్చారు. ఆయా నియోజకవర్గాల ఏఈఆర్వోలు, ఐటీ బృంద సభ్యులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.